

తలుపు తెంతీసి గదిలోకి ప్రవేశించబోతున్న కృష్ణకి ప్రక్కవాటాలోనుంచి "పాట పాడుమా కృష్ణా పలుకుతేనె లొలుకునటుల" అంటూ తియ్యని కోకిలస్వరంతో పాట వినిపించింది. టక్కున ఆగి వసారాలోనుంచి వీధిలోని వేపచెట్టుమీదికి చూచి "అరే, కాకులన్నీ చెట్టుమీద కదలకుండా కూర్చున్నాయే ? అయితే ఆ పాడేది పిన్నిగారు కాదన్నమాట" అనుకుని గదిలోకి వెళ్లిపోయాడు.

పాట పూర్తయింది. మరోపాట, ఆ తర్వాత ఇంకొకటి. కృష్ణ చదువుకుందామని పుస్తకం తెచ్చాడు. కానీ ఎట్లా ? ప్రక్కన గొంతు సిలోన్ రేడియోలాగా మోగుతుంటే ! మంచంమీద వాలి కళ్లు మూసుకున్నాడు. ప్రక్క వాటాలో గొంతు మరింత పెద్ద శ్రుతిలో మరోపాట నందు కుంది. అతనికి వినుగుపుట్టి, రెండు చెవులూ గట్టిగా మూసుకున్నాడు. ఒకవిధంగా అతనికి ఈర్ష్య కలిగిందని చెప్పొచ్చు. ముఖ్యంగా అతను గొంతెత్తితే గార్దభాలు గంతులు వేస్తాయనేవాడు క్లాస్‌మేట్ గోపాల్, అందుకే అతనికి "ఒరే నాన్నా ! నీ గొంతు ఎలాగూ సంగీతానికి పనికి రాదు, కాబట్టి నామాట విని అది మానేసి, ఏదయినా వాద్యం నేర్చుకో" అని సలహా ఇచ్చాడు.

"కలగంటే కలగంటి కమలారేకులావంటి .... కలలోనా .... లలలానా, లలలానా" అరిగిపోయిన గ్రాంఫోన్‌ప్లేట్‌లాగా పాడుతోంది ప్రక్క వాటాలోని గొంతు.

కృష్ణకి కోపం ముంచుకువచ్చింది. "ఏం జరిగిం దిట. కలలోన బుగ్గ గిల్లాడా, ముక్కు పట్టు కున్నాడా ?" అనుకుంటున్నంతలో "అమ్మోయ్ !" అంటూ పెద్ద ఆర్తనాదం వినిపించింది.

మంచంమీద పడుకున్నవాడల్లా ఎగిరి కూర్చుని "ఏం జరిగింది, హత్యా—ఆత్మహత్యా ?" అనుకు న్నాడు, శవసాహిత్యం బుర్రలో గిర్రున తిరుగు తుంటే. "అత్తాయ్ !" ఆర్తనాదపు గొంతు మరోకేక పెట్టింది. "ఏమిటే అమ్మాయ్ !"

# మాటలునేర్చిన చిలుక

శర్మ



అది పిన్నిగారి గొంతు._

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

"ఓహో అదిటే! బొద్దింకని చూచా భయ పడటం ? భలేదానివేలే !" అని పిన్నిగారి గొంతు నవ్వింది. కృష్ణ నవ్వుతూ మంచం దిగి కుర్చీలో కూర్చుని పుస్తకం తెరిచాడు.

ఉదయం చాలా ఆలస్యంగా లేచాడు కృష్ణ. గబగబా బాత్‌రూందగ్గరకు వెళ్లి అలవాటు చొప్పున తలుపును ఒక్క తోపు తోశాడు. తెర్చుకో లేదు. అంటే లోపల ఎవరో ఉన్నారన్నమాట.

గదికి తిరిగి వచ్చి కాస్సేపు కూర్చుని వెళ్లాడు, బంధింపబడున్న బాత్‌రూం తలుపులు వెక్కిరించాయి. అప్పటికి తొమ్మిదైంది. అవతల హోటలుకు పోయి మీల్సు తీసుకోవాలి. ఆ తర్వాత కాలేజీకి అందుకోవాలి. ఆతనిలో ఆతృత హెచ్చింది. "కలగంటే కలాగంటే" అదేగొంతు బాత్‌రూంలో నుంచీ వినిపించింది. "హేయ్‌రామ్ !" అనుకుంటూ అక్కడే ఉన్న బండమీద కూలబడ్డాడు కృష్ణ. పావుగంట గడిచింది. "మరోయుగందాకా తీరికగా స్నానం చెయ్యండి !" అనుకుని కోపంగా గదికి వచ్చేశాడు.

"ఏమోయ్ కృష్ణమూర్తి ! కాలేజీకి పోతు న్నావా, ఇంకా స్నానం చేసినట్టులేదే ?" అన్నార

57-వ పేజీ చూడండి

# మాటలు నేర్పిన చిలుక

9-వ పేజీ తరువాయి

జగన్నాథంగారు ఇంట్లోనుంచి వీధి అరుగుమీదికి వస్తూ.

పుస్తకాలు చంకలో ఇరికించుకుని తలుపుకు తాళం వేస్తున్న కృష్ణ "అబ్బే, లేదండీ! ఒంటికి కొద్దిగా నలవరం తగిలినట్టుంటేనూ, అందుకని సాయంత్రం వచ్చి చేద్దామని ...."

"అరే, నలవరం తగిలిందా? ఉండుండు మిరియాల కషాయం ఒక 'డోస్' పుచ్చుకుందూగాని."

"వద్దండీ!"

"అదేమిటోయ్! మీనాన్న నీమీదా, నీ శరీరం మీదా బాధ్యతలన్నీ మా కప్పగించాడు తెల్సా?"

"అది కాదండీ! డోకొస్తుంది అందుకని" అని గుమ్మంవైపు చూచి "బాబాయ్‌గారూ! ఈమధ్య సిలన్ రేడియోలో తెలుగు రికార్డులు తెగ దంచేస్తున్నారే?" అన్నాడు అనుమానంగా.

జగన్నాథంగారు వళ్ళు కదిలిపోయేట్టు నవ్వుతూ "అదిటోయ్! అదీ మా మేనగోడలు గొంతు లేవోయ్! సెకండియర్ చదువుతోం దిక్కడ. మా బావగారికి రెండు రోజుల క్రితమే బెజవాడకి బదిలీ అయింది. ఎలాగూ పిల్ల చదువుకుంటోంది, పరీక్షలు మరో రెండు నెల్లు లేవు, ఈలోగా మరో కాలేజీలో మార్చెందుకని ఇక్కడే ఉంచమన్నాం. కొద్దిగా సంగీతం వచ్చులే. వీణ బ్రహ్మాండంగా వాయిస్తుంది. ఇటీవల రెండు, మూడు ప్రోగ్రాంలుగూడా ఇచ్చింది. ఏం, ఒక పాట వింటావా?" అన్నారు కళ్ళెగరేసి నవ్వుతూ.

"వాట్! రేడియో ప్రోగ్రామ్సు?" అంటూ ఆశ్చర్యపోయాడు.

"అవును వింటావా ఒకటి."

"కాలేజీకి టైమైంది, మరోసారి వింటాను" అని మెట్లు దిగి వీధిలోకి వెళ్ళిపోయాడు.

"అనాదిగా ఏ భారతీయ స్త్రీ చదువుసంధ్యలు నేర్చి ఉద్యోగాలు చెయ్యలేదు. అలాంటిది నేడు స్త్రీకి చదువెందుకు? చదివా రనుకున్నా ఉద్యోగాలకు ఎందుకు ఎగబడాలి? ఎగబడినా వాటిని చేస్తూ పురుషునితో సమానహక్కుల్ని ఎందుకు కోరాలి? కోరినా వాటిని ప్రభుత్వం స్త్రీలకు ఎందుకు దత్తంచెయ్యటానికి ప్రయత్నిస్తోంది? పూర్వంనుంచీ ఆడది—అబల అనే ఆర్యోక్తి ఉండనే ఉంది. ఎక్కడో—వంటింటి పనులు చూచుకుంటూ గృహాన్ని చక్కబర్చుకోవల్సిన పని తలు మగవారితో సమానంగా నడిబజారుల్లో తిరుగుతూ, వారితో సమాన హక్కుల్ని కోరటం తప్పు, ఎందుకంటే మగవారికున్న ధైర్య స్థైర్యాలలో నూరోవంతు ఆడవారికి లేవు. అందుకు నిదర్శనం ఒక సందర్భాన్ని ఉదహరిస్తాను. నిన్నటి రోజు ఒక యువతి బొద్దింకని చూచి హడలిపోయి అదిరిపోయేలాగా ఆర్తనాదం చేసింది.. పోనీ ఆమె విజ్ఞానంలో తక్కువతిందా అంటే అదీ లేదు. కళాశాలలో చదువుతోంది. కాని ఆమెలో అబలత్వం పిసరంతగూడా పోలేదు. అంటే ముఖ్యకారణం ఆడది—అబలే అన్న ప్రత్యక్ష నిదర్శనం" అని అనర్గళంగా చెప్పి జేబు రుమాలుతో ముఖం తుడుచుకున్నాడు కృష్ణ.

"హియర్, హియర్!" "వన్స్‌మోర్!" లతో బాటు "కృష్ణమూర్తికి జై!" అన్నవాళ్ళూ లేకపోలేదు. కాలేజీ బల్లలు బద్దలయ్యేటట్టు మోగించారు విద్యార్థిబృందం.

చక్కని స్తుతితో బల్లమీద కొడ్తూ "ఆర్డర్, ఆర్డర్!" అంటూ అరిచాడు స్పీకర్. ప్రిన్సిపాల్ బల్లపై చేతులు ఆన్చి, కళ్ళజోడులోనుంచి కృష్ణను చూచి నవ్వారు.

"కుమారి రేణుక!" చదివాడు స్పీకర్. "కుమారి రేణుక, కుమారి రేణుక!" అంటూ కేక పెట్టాడు బంట్రోతు పనికి ఒప్పుకున్న ఒక వ్యక్తి. మైక్ ముందుకు వచ్చింది రేణుక. "హచ్" అంటూ తుమ్మిందొక మర్కటం. పెద్దగా నవ్వులు. "ఆర్డర్, ఆర్డర్" అన్న స్పీకర్ అరుపులు.

రేణుక ఒక చేత్తో మైక్‌ను పట్టుకుని "అనాది నుంచీ ఆడవారు ఉద్యోగాలు చేసిఉండకపోవచ్చు. కానీ అనేక మహత్తరమైన కార్యాలలో ముందడుగు వేశారన్నది నగ్నసత్యం. అందుకు తార్కాణము చరిత్రలో ఝాన్సీరాణీ, రుద్రమ. నేటి నిజజీవితంలో విజయలక్ష్మి పండిట్, ఇందిరా గాంధీలే కాక అనేకమంది ఆడవారు గొప్పవారున్నారు. ముఖ్యంగా అవకాశమిస్తే ఆడవారు తప్పక పైకివస్తారు. ఇందాక ఒక మిత్రుడు, ఒక యువతి బొద్దింకని చూచి భయపడిందన్నారు. అతన్ని ఒక ప్రశ్న వేస్తున్నాను. తను మాత్రం భయపడడా? కాకపోతే పాముని, లేకపోతే తేలుని చూచైనా భయపడ్తాడు. కాబట్టి ఒకర్ని విమర్శించేముందు తమ ధైర్య స్థైర్యాలను విమర్శించుకోవటం ముఖ్యం. ఒకటేమిటంటే అనాదినుంచీ ఆడవారిలో కావ్యాలు వ్రాసినవారు, కత్తిపట్టి కదనరంగంలోకి దూకినవారున్నారు. అలాంటప్పుడు స్త్రీ, పురుషునితో సమాన హక్కుల్ని కోరటం తప్పా? చదువుకోటం తప్పా? ఉద్యోగాలు చెయ్యటం తప్పా? అంటూ చెప్పుకుపోతోంది, విద్యార్థి బృందం నుంచీ ఒక గొంతు "ఉహు .... హూ" అంటూ గుర్రంలాగా సకిలించింది. గొల్లుమన్నారు విద్యార్థులు కొందరు బల్లలమీద ముక్తాయింపు మొదలుపెట్టారు.

"ఆర్డర్, ఆర్డర్!" అంటూ అరిచాడు స్పీకర్. నిశ్శబ్దం ఆవరించింది. "కేరీ ఆన్" అన్నాడు.

"నాకు తెల్సు గుర్రాలు సకిలిస్తాయని, ఇలాంటి పొగరుమోతు గుర్రాలకు కళ్ళాలు వేసే ఏర్పాట్లు చెయ్యమని శ్రీ ప్రిన్సిపాల్‌గారిని కోరుతున్నాను. అలాంటి పొగరు ...." "టింగ్" న బెల్లు మోగింది. ఆ రోజుకు "స్త్రీ—విద్య" మీద చర్చ ముగిసింది.

అంతా గుంపులు గుంపులుగా బయటకు నడుస్తున్నారు. "చ, ఛా వెధవన్నర వెధవా! వారం రోజుల్నుంచీ డబ్బా వాయించి చివరికి చచ్చు ఉపన్యాస మిచ్చావ్ నీకన్నా ఆ ఆడపిల్ల నయం" అన్నాడు గోపాల్ వెక్కిరింతగా.

కాలేజీనుంచీ ఇంటికి బయల్దేరింది రేణుక.


సినీతారల ఫోటోలు

మీ అభిమాన సినీతారల ఒరిజినల్ ఫోటోలు అందమైన పోజులలో కార్డు సైజు డజను 1 కి రు. 5/- పోస్టేజి రు. 1/- అదనం.

CENI PHOTO DISTRIBUTORS
(P O) Relangi (W. G. Dt)



ఉచితము

"కాశ్మీర్ బ్యూటీ" 6 గజముల చేనేత చీరలధరలు ఆశ్చర్యకరంగా తగ్గింపబడినవి. 6 గజముల చీర రు8/- (అసలు ధర రు. 12) 2 చీరలు రు 15/- 3 చీరలు రు21/- పోస్టేజీతో



సహా.3 చీరలుకొనువారికి సిల్కు బ్లౌస్ & క్రొత్త సంవత్సర డైరీ ఉచితము.

SATISH & CO (A' P.W.)
Jama Masjid, Delhi-6





అరితేరిన అధ్యాపకులు. మంచి పరీక్షా ఫలితాలు

## రవి ట్యుటోరియల్ కాలేజి

బాలికా శాఖ | బ్రాడీపేట, గుంటూరు | బాలుర శాఖ

జూనియర్, సీనియర్, మెట్రిక్, S.S.L.C, P.U.C. పరీక్షలకు శిక్షణ యివ్వబడును. క్లాసులు ప్రారంభం జూన్ 1

ప్రిన్సిపాల్:- సి. వి. యస్. ధన్ M.A.

రెసిడెన్షియల్ | హాస్టల్స్

## మీ అందానికి మంచిదారి



మీ జీవిత విజయాలకు అందం అవసరం. ఎండవేడికి యింకా యితరకారణాలవల్ల ముఖం క్రమేపి నల్లబడి, ముదిరూపువస్తుంది. గ్లోరియా అనే ద్రవముయొక్క అద్భుతసౌందర్య పోషకశక్తి మీ ముఖంలోని అసహ్యమయిన ముదిరూపును పోగొట్టి ఆకర్షణీయమయిన లేతదనాన్ని తెస్తుంది. మీ అందం దినదినాభివృద్ధి అవడానికి నెలకు అర్ధమం కొన్నిసార్లు అయినా గ్లోరియా అనే సౌందర్యపోషక ద్రవాన్ని వాడండి. ముఖంమీద మొటిమలను వాటి మచ్చలను, ముడతలను, నమ్మకంగా పోగొట్టి ముఖాన్ని తెలుపుచేసి, కాంతిని, అందాన్ని తెచ్చును మొదటి పూతకే మీకు ఆశ్చర్యాన్ని కలిగించే అందాన్నియిస్తుంది. ఒకసారి వాడి చూస్తే మీరెప్పుడూ విడువరు. అన్నిషాపులలో దొరకును

జనితా ప్రొడక్ట్సు - ఏలూరు. (ఆంధ్ర)

దుర్గా పాపెప

## తెలుసుకొని బాగుపడండి!




దాంపత్య సుఖాలు అనుభవించుటకూడ, అవసరమును, మందులు లేకుండా పిల్లలు పుట్టకుండా చేసుకోడానికి ప్రపంచంలోని పెద్ద డాక్టర్లు కనిపెట్టిన, సులభమైన 60 మార్గాలు "సంతానము" అనే తెలుగు పుస్తకంలో వున్నాయి. అవసరం లేనపుడు గర్భం రాకుండా చేసే మార్గాలు, ప్రమాదాలు లేకుండా, సుఖప్రసవానికి గర్భిణీ స్త్రీలు ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలు, పసిపిల్లలకు రోగాలు లేకుండా, పుష్టిగా ఆరోగ్యంగాను, ఎక్కువ ఖర్చు లేకుండా పెంచే మార్గాలు, అవసరమైన చోట్ల, బొమ్మలతో సహా ఏ.వి.యస్. మూర్తి, ఎం.ఏ. గారు "సంతానము" అనే తెలుగు పుస్తకంలో వ్రాశారు. అనేక సంసార సమస్యలను తీర్చగల ... మీరు చదివి తీరవలసిన పుస్తకం. వెల రూ 3.50 పోస్టు ఖర్చులు ఉచితం. దేశసుభక్తుడు దణాలు, అశోకనగరు, ఏలూరు, ఆంధ్ర కు ఉత్తరం వ్రాస్తే మీకు కూడ ఒక పుస్తకం వెంటనే వి.పి. పోస్టు ద్వారా పంపబడును.

## కుష్టు సమస్త మహా వ్యాధులకు బొల్లి

మొదటి నెలలో 40% నివారణ!!! 10% నివారణ!!

లెప్సిన్ అమోఘ ఔషధము!!!

వివరములకు: గ్రంధే రఘురామ గుప్త

అమర జ్యోతి ప్రొడక్ట్సు మార్కాపురం కర్నూలు జిల్లా

# మాటలు నేర్చిన చిలుక

కొద్ది దూరంలో ఆమె వెనుకగా తలొంచుకు నడుస్తున్నాడు కృష్ణ. మలుపు తిరిగి వెనక్కి చూచింది అదే క్షణంలో అతనూ తలెత్తి చూచాడు "అరే!" అనుకున్నాడు. ఆమె మనస్సులోనూ అదే శబ్దం ధ్వనించింది. గేటుముందుకొచ్చి వెనక్కి చూచింది. అతనూ గేటును సమీపించాడు. రేణుక గుండె గుబగుబలాడుతుంటే గబగబా గుమ్మం చేరుకుంది. అరుగు ఎక్కి గది తలుపులు తియ్యసాగాడు కృష్ణ. రేణుక "ఛడేల్" న తలుపులు మూసేసింది. కృష్ణ లోపలికిపోతూ బయటికి చూచాడు. తలుపులు మూసుకున్నాయి. అతనూ తలుపులు మారుమోగేట్టు మూసేశాడు.

రాత్రి కుర్చీలో కూర్చుని చదువుకుంటున్న కృష్ణకు నేలను బరుకుతున్న చప్పుడు వినిపించింది. అప్పటికి వారంరోజుల్నుంచీ ఒక ఎలుక తూములోనుంచి వచ్చి ఇష్టం వచ్చినంతసేపు స్వేచ్ఛావిహారంచేసి పోతోంది. ఏమ్మైనాసరే,

ఈరోజు దాని అంతం చూడాలని చుట్టూ చూచాడు. కర్ర ఏదీ కనిపించలేదు. గదిలోనుండి బయటికివచ్చి అరుగంతా వెతికాడు. అక్కడా ఏదీ కనిపించక మళ్లీ లోపలి కొచ్చాడు. 'హండ్రడ్ కాండిల్' బల్బు కాంతిలో తూములోనుంచి సుమారు అరచేతి వెడల్పున, నల్లగా, నిగనిగలాడుతున్న ఒక ప్రాణి పాకుతూ వస్తోంది. అదేమిటో మొదట అర్థంకాలేదు. అర్థం చేసుకునేసరికి హడిలి, ఎగిరి, మంచంమీదికి దూకాడు. అరుద్దామని గొంతు తెర్చాడు. అందులోనుంచీ శబ్దం రావటం మానేసింది. ఆ ప్రాణి పాకుతూ మంచం దగ్గరకు వచ్చింది. కృష్ణ గడగడా వణకసాగాడు. లైటు కాంతిలో అది స్వేచ్ఛావిహారం ప్రారంభించి, చిన్న చిన్న కీటకాల్ని వేటాడసాగింది. కృష్ణకి చెమటలు ధారలుకట్టసాగాయి.

జగన్నాథంగారికి రాత్రి భోంచేసినతర్వాత అరుగుమీద కాసేపు పడకకుర్చీ వేసుకు కూర్చుని పేపర్ చదవటం అలవాటు. గదిలో మంచంమీద కూర్చున్న కృష్ణ ఆ ప్రాణినే కన్నార్పకుండా చూడసాగాడు. కొంతసేపు విహారంచేసి తూములోకి దూరింది. అతనికి జగన్నాథంగార్ని మింగేద్దామన్నంత కోపం వచ్చింది. "అయినా యీ తూము లేమిటి? గంగాళ్ళలాగా, ఏ సూదిమొనంతో ఉండాలిగానీ" అనుకుంటూ మంచందిగి బయటి కొచ్చాడు.

"ఏమోయ్ కృష్ణమూర్తి! తలుపులు బిడాయించుకుని మరి చదివేస్తున్నావ్, ఆ" అంటూ పలకరించారు జగన్నాథంగారు.

కృష్ణ, ఆయన ఇంటి గుమ్మంవైపు చూస్తూ మెల్లిగా "బాబాయ్‌గారూ! ఒకసారి రోకలిబండ ఇస్తారా?" అన్నాడు, అతని దృష్టిలో పాన్ని చంపాలంటే అదే ఆయుధం.

జగన్నాథంగారు ఇంటి [illegible] ఎగిరి [illegible]లాగ నవ్వుతూ "రోకలిబండెందుకు [illegible]! పచ్చడిగాని చేస్తావా ఏం? మేమంతా [illegible]ం సుమా!

అన్నారు. కృష్ణ బిక్కచచ్చినవాడిలాగా తలొంచుకున్నాడు.

"అమ్మాయ్ రేణూ! రోకలిబండొకసారి పట్టా అమ్మా!" అని కేకపెట్టి పేపర్లోకి తల దూర్చారు.

రోకలిబండెందుకు మామయ్యా! పచ్చడి తయారుచేస్తారా?" అంటూ రోకలిబండ తెచ్చి, గుమ్మందాకా వచ్చి, కృష్ణని చూచి "మీకా, ఏం యుద్ధానికి వెళ్తున్నారా?" అంది నవ్వుగా నవ్వుతూ. కృష్ణ సిగ్గుతో తలొంచుకున్నాడు. రేణుక లోపలికి వెళ్ళిపోయింది. అతను దాన్ని పుచ్చుకుని గదిలోకి వెళ్ళాడు. మంచంమీద కూర్చుని తూమువంక చూస్తున్నాడు.

ఒకగంట గడిచింది.

తూము ముందు ఏదో కదిలింది. కృష్ణ గుండెల్లో దడ ప్రారంభమైంది. "అమ్మో! అది కుట్టిందంటే ఏమైనా ఉందా? రోకళ్ళతో నడ్డి మీద దబాయించినట్టుంటుందిట అనుకుని గడగడ వణకసాగాడు. మళ్ళీ విహారం ప్రారంభించి మంచం సమీపించింది ఆ ప్రాణి. అతను మంచంమీంచి వంగిగురి చూచి రెండు కళ్ళూ గట్టిగా మూసుకుని, రోకలిబండను గట్టిగా గచ్చుమీద నొక్కాడు. కళ్ళుతెరిచి చూచేసరికి ఆ ప్రాణి నరవానర చూచిన నాగుబాములాగా చరచరానలు ప్రక్కలకూ కొండ్లు కొట్టసాగింది. కృష్ణ రోకలిబండవైపుకు చూచాడు. అది గచ్చును అంటీ అంటనట్టుండి స్థిరత్వంలేక నాట్యంచేస్తోంది. దానికి మూలాధారమైన అతని చెయ్యి గజగజ వణికిపోతోంది. ఇక దాన్ని చంపటం తనవల్ల కాదు. పలాయనమే ప్రధానకర్తవ్యంగా గుర్తించినవాడై, ఆ ప్రాణి ప్రక్కకు వెళ్ళటం చూచి మంచంమీదనుంచి దూకి, గది తలుపులు తెరుచుకుని, బయట పడ్డాడు. అతను దూకిన చప్పుడుకు, అప్పటికే కునుకుతీస్తున్న జగన్నాథంగారు ఉలిక్కిపడి లేచారు. ఆయన కుర్చీకి వెనుకప్రక్కగా వెళ్ళి నిలబడి "బా .... బా .... బావ్గారూ! మ .... మ .... మండ్రగబ్బ" అంటూ అదిరిపోయేలాగా అరిచాడు.

"ఆ, మ .... మ .... మండ్రగబ్బే!" అంటూ అంతవరకూ పడక్కుర్చీలో కాళ్ళు చాచుకు పడ్డకున్న జగన్నాథంగారు, రెండు కాళ్ళనూ కుర్చీలోకి లాక్కుని "ఏమేవ్, హోయ్! నిన్నే .... ఇలారా" అంటూ పెద్దగా కేక పెట్టారు. ఆయన అరుపులకు పిన్నిగారు, రేణుకా పరుగెత్తుకొచ్చారు. "మ.. మ .... మండ్రగబ్బట, ఎవరైనా చూస్తే!" అంటూ గట్టిగా అరిచారు. "హా" అంది పిన్నిగారు. రేణుక కిలకిలా నవ్వింది. కృష్ణ తెల్లబోయాడు.

"మండ్రగబ్బని చంపటానికి మరోకళ్ళెందుకు మామయ్యా! మనం లేం?" అని మళ్ళీ నవ్వింది. పిన్నిగారూ నవ్వారు.

రేణుక పమిటకొంగు నడుంచుట్టూ బిగించి ధైర్యంగా గదిలోకి వెళ్ళింది. కృష్ణ, జగన్నాథంగారు, పిన్నిగారూ వింతగా చూడసాగారు.

పావుగంట గడిచింది.

రేణుక చచ్చిన మండ్రగబ్బను పుచ్చుకుని బయటికి వచ్చింది. "ఆ .... అమ్మాయ్! జాగ్రత్త కుట్టగలదు." అన్నారు జగన్నాథంగారు భయంగా. అప్పటికి కొంత ధైర్యం చిక్కింది కృష్ణకి "అరే, మీరు చాలా ధైర్యవంతులే ఏమో అనుకున్నాను" అన్నాడు ఆశ్చర్యంగా.

"హుం, ఆడది—అబల, కనీసం మగవాడికున్న ధైర్యంలో నూరోవంతు కూడా ఉండదు, బొద్దింకని చూచి భయపడుతుంది (ఈ విషయంలో కృష్ణకు తెలియని ఒక విషయం మీకు చెప్తాను. ప్రారంభంలో ఆమె పాటపాడుతున్నప్పుడు ఒక బొద్దింక ఉన్నట్టుండి ఎగిరి ఆమెమీద పడింది. అంతవరకూ ఆమెకు తెల్సింది బొద్దింక పాకుతుందని మాత్రమే. అనుకోకుండా ఎగిరి మీదపడేసరికి అదిరిపోయి కేక పెట్టింది)" అంది కచ్చిగా.

"పాటలుపాడే చిలుకకు మాటలు నేర్పాలా?" అంటూ నవ్వుగా గొణిగాడు.

"హా, ఏమిటీ?" అంటూ కోపంగా కళ్ళు పెద్దవిచేసి చూచింది రేణుక. కృష్ణ నవ్వుతూ గదిలోకి వెళ్ళిపోయాడు. వాళ్ళ సంభాషణ నీకేమైనా అర్థమైందా అన్నట్టు చూచారు జగన్నాథంగారు భార్యవంక. తెల్లబోయి గడ్డంక్రింద చెయ్యి పెట్టుకు విస్తుపోయింది పిన్నిగారు. రేణుక ఒక క్షణం వారివంక చూచి నవ్వుతూ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"చిలకా—గోరింకల్లాగా ఉన్నారు" అంది పిన్నిగారు ముచ్చటపడూ.

"ఆ, అట్సాగా? మనం లేమూ పార్వతీ—పరమేశ్వరుల్లాగ!" అంటూ గట్టిగా నవ్వారు జగన్నాథంగారు.

"చాల్లెండి సంబడం" అంటూ పిన్నిగారు గిరగిరా ఇంట్లోకి వెళ్ళిపోయింది.

వస్తున్న ఆవలింతకు నోటిమీద తాళంవేస్తూ ముడిచిపెట్టుకున్న కాళ్ళను కుర్చీలో మంచీ క్రిందికి దించి కళ్ళు మూసుకున్నారు జగన్నాథంగారు.


క్యాలెండర్లు

నాణ్యమైన ఫోటో ఆఫ్‌సెట్ క్యాలండర్లకు మమ్ము సంప్రదించండి. క్యాలండరు బొమ్మలను క్యాలెండరు మ్యానుఫ్యాక్చర్లకు, ప్రింటర్లకు ప్రత్యేక ధరలకు సప్లయి చేయుదుము.
మంచికమీషనుపై పని చేయుటకు సమర్థులైన ఏజంట్లు కావలెను. వ్రాయండి.

AJANTA ARTCALENDAR Mfg.Co.
*P. B. 255, MADRAS—1.*
or P. B 962, Calcutta-1.

నెలకు రు. 200 సంపాదించండి

ఎలెక్ట్రిక్ మరియు రేడియో గైడ్.
400 చిత్రపటములు గలదు. దీని సహాయంతో రేడియో రిపేర్లు, రు. 15కు స్వంత రేడియో తయారుచేసుకొనవచ్చు. రేడియో రిపేరు, వైరింగ్, ఎలక్ట్రికల్ మెకానిజం, ట్రాన్సిస్టర్ రేడియో తయారుచేయడం నేర్చుకొనండి. ధర రు. 8. డ్రాయింగ్ & పెయింటింగ్ రు. 5. ఫోటోగ్రఫీ రు 3. టైలరింగ్&కటింగ్ రు 5. పోస్టేజి ప్రతి పుస్తకమునకు రు. 1 అదనము.
ఇల్ ఫా బుక్ డిపో (A-12)
రఫత్ గంజ్, అలిఘర్ (U.P)

